ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com

# కాకతీయ

శుక్రవారం 07 ఆగస్టు, 2026 | సంపుటి - 01 సంచిక - 358 | పేజీలు -04 వెల - 5

## రాయదుర్గం భూముల కేసులో డ్రోన్ సర్వేకు బ్రేక్

- హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే
- యథాతథ స్థితి కొనసాగించాలని కీలక ఆదేశాలు
- హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి అవకాశం



2లో

# యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్..!

- యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్..!
- విపక్షాల ఆందోళనల మధ్యే కీలక బిల్లుల ఆమోదం
- పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ చట్ట సవరణకు సభ ఆమోదం
- యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలకు మార్గం
- ఏ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేయాలన్నది కేంద్ర నోటిఫికేషన్‌తో నిర్ణయం బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు కొత్త అధికారం
- ట్యాక్సేషన్ బిల్లు ఆమోదం.. ఎలక్ట్రానిక్స్ రంగానికి దీర్ఘకాలిక పన్ను రాయితీలు






కాకతీయ, నేషనల్ డెస్క్ : ప్రతిపక్షాల నినాదాలు, సభలో గందరగోళం మధ్య లోక్‌సభ గురువారం వరుసగా కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న యూపీఐతో పాటు ఇతర నోటిఫైడ్ డిజిటల్ చెల్లింపులపై భవిష్యత్తులో ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లును ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదించింది. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే అయోధ్య రామమందిరంలో కానుకల చోరీ, విద్యార్థులపై పోలీసు చర్యల అంశాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతోసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని నిర్వహించకుండానే స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమైన తర్వాత పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ప్రభుత్వం తీసుకొచ్చిన కీలక బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించారు.

### యూపీఐ లావాదేవీలపై కొత్త నిబంధనలు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టం–2007 సవరణ బిల్లు ప్రకారం, యూపీఐతో పాటు కేంద్రం నోటిఫై చేసే ఇతర డిజిటల్ చెల్లింపులపై ఛార్జీలు విధించే అధికారం బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు కల్పించేలా చట్టంలో మార్పులు చేశారు. ఇప్పటి వరకు యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేయకుండా ఉన్న నిబంధనను తొలగించారు. ఇకపై ఏ డిజిటల్ లావాదేవీలపై ఛార్జీలు అమలు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించనుంది. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, సేవలందించే సంస్థలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడమే ఈ సవరణల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది.

తరువాయి 2లో

## గిగ్ వర్కర్లకు భరోసా

- 15 నుంచి కొత్త నిబంధనలు
- అమల్లోకి 'గిగ్ వర్కర్ల చట్టం' నిబంధనలు
- ఉద్యోగ భద్రత, బీమా, సంక్షేమ నిధికి మార్గం
- నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.50 వేల వరకు జరిమానా




కాకతీయ,తెలంగాణ బ్యూరో : తెలంగాణలో గిగ్, ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. శాసనసభ ఆమోదించిన 'తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు–2025' అమలుకు సంబంధించిన నిబంధనలు ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి. సుమారు మూడు లక్షల మంది గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ చట్టం అమలు కోసం శక్తి (స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్) శాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. గిగ్ వర్కర్ల సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం శక్తి శాఖ మంత్రి అధ్యక్షతన ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి, సామాజిక భద్రత, బీమా పథకాలను అమలు చేయనున్నారు.

### కార్మికులకు ఉద్యోగ భద్రత

కొత్త చట్టం ప్రకారం గిగ్ వర్కర్లను తొలగించాలంటే కనీసం వారం రోజుల ముందే నోటీసు ఇవ్వడం తప్పనిసరి. అయితే వినియోగదారులపై శారీరక లేదా మానసిక వేధింపులకు పాల్పడినట్లు తేలితే సంబంధిత సంస్థలు వెంటనే సేవల నుంచి తొలగించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి గిగ్ వర్కర్‌కు ప్రత్యేక రిజిస్ట్రేషన్ ఐడీ ఇవ్వనున్నారు.

తరువాయి 2లో

## ప్రజల్లోకి కాక్రోచ్ జనతా పార్టీ..

- 'క్యా బోల్తీ పబ్లిక్'కు శ్రీకారం
- సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్త ప్రజా సంప్రదింపుల యాత్ర
- విద్య, నిరుద్యోగమే ప్రధాన ఎజెండా : సిజెపి నేతలు
- సభ్యత్వ నమోదు ప్రారంభం.. విరాళాలకు దూరమని స్పష్టీకరణ



న్యూఢిల్లీ : నీట్ అక్రమాల అంశంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో జాతీయ స్థాయిలో చర్చకు వచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తదుపరి కార్యాచరణను ప్రకటించింది. మహారాష్ట్రలోని శంభాజీనగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ అనంతరం పార్టీ నేతలు అభిజీత్ దిప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంగా మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలతో నేరుగా మమేకమయ్యే లక్ష్యంతో 'క్యా బోల్తీ పబ్లిక్' పేరుతో భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ విద్యార్థులు, యువత, ఉద్యోగులు, సాధారణ ప్రజల సమస్యలు, అభిప్రాయాలు, ఆశయాలను నేరుగా తెలుసుకుంటామని తెలిపారు. ప్రజల స్వరాన్ని జాతీయ స్థాయిలో వినిపించే వేదికగా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.

తరువాయి 2లో

## ప్రేమ కోసం తండ్రికే సవాల్..!

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ఇంట్లో కుటుంబ వివాదం రాజకీయ రంగు
- ప్రేమ వివాహానికి అడ్డుకుంటున్నారని కుమారుడి ఆరోపణలు
- 'అతనితో నాకు సంబంధం లేదు' అంటూ ప్రకాశ్ గౌడ్ స్పందన




తరువాయి 2లో

కాకతీయ,తెలం గాణ బ్యూరో : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కుటుంబంలో చెలరేగిన ప్రేమ వివాదం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు అధికార పార్టీ ఎమ్మెల్యే హోదా, రాజకీయ ప్రభావం.. మరోవైపు ప్రేమించిన యువతిని వివాహం చేసుకోవాలనే కుమారుడి పట్టుదల.. ఈ వ్యవహారాన్ని కుటుంబ కలహం స్థాయి దాటి బహిరంగ వివాదంగా మార్చాయి. తండ్రిపైనే తీవ్ర ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యే కుమారుడు సంతోష్ గౌడ్ మీడియా ముందుకు రావడం, దానికి ప్రకాశ్ గౌడ్ ఘాటుగా స్పందించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. తాను ప్రేమిస్తున్న రూపారెడ్డిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నానని, అయితే సొంత తండ్రే దీనికి అడ్డుపడుతున్నారని సంతోష్ గౌడ్ ఆరోపించారు. ప్రేమ వివాహాన్ని అడ్డుకునేందుకు ఆస్తి వివాదాలు, కుటుంబ అంతర్గత విభేదాలను తెరపైకి తీసుకొస్తూ తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తమపై గూండాలతో దాడులు చేయిస్తున్నారని కూడా ఆరోపించారు.

## మారుతోందా ఆర్‌ఎస్‌ఎస్ స్వరం..?

- భావజాలం అదేనా.. భాష మాత్రమే కొత్తదా?
- యువతను దగ్గర చేసుకునే వ్యూహంలో సంఘ్ పరివార్?
- మోహన్ భాగవత్ వ్యాఖ్యల వెనుక రాజకీయ సంకేతాలేనా?
- విమర్శల నుంచి సంభాషణ వైపు ఆర్‌ఎస్‌ఎస్ అడుగులు?
- 2029 లక్ష్యంగా 'సాఫ్ట్ ఇమేజ్' నిర్మాణానికి ప్రయత్నమా?
- బీజేపీ రాజకీయాలకు కొత్త కథనం సిద్ధమవుతోందా?



కాకతీయ, నేషనల్ డెస్క్ : ఒకప్పుడు జాతీయత, క్రమశిక్షణ, సాంస్కృతిక జాతీయవాదం చుట్టూ మాత్రమే తన సందేశాలను పరిమితం చేసిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)... ఇప్పుడు యువత మనస్తత్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తోందా? ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఇదే చర్చకు కారణమవుతున్నాయి. "జెన్–జీ దేశ వ్యతిరేకులు కాదు... ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు" అని ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక సభా ప్రసంగంగా కాకుండా... సంఘ్ పరివార్ ఆలోచనా ధోరణిలో వస్తున్న వ్యూహాత్మక మార్పుగా విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా యువతలో పెరుగుతున్న అసంతృప్తి, సోషల్ మీడియా ప్రభావం, ఉద్యోగాలు, విద్య, భావ వ్యక్తీకరణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న విమర్శల నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ స్వరం మరింత మృదువుగా మారుతోందనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. భాగవత్ వ్యాఖ్యలను కూడా అదే పరిణామంలో భాగంగా చూస్తున్నారు.

### యువతను చేరుకునే కొత్త వ్యూహమా?

గత దశాబ్దంలో దేశ రాజకీయాల్లో యువత ప్రధాన ఓటు బ్యాంక్‌గా మారింది. కానీ అదే సమయంలో ఉద్యోగాలు, పరీక్షల నిర్వహణ, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ వంటి అంశాలపై యువతలో అసంతృప్తి కూడా పెరిగింది.

తరువాయి 2లో

## నకిలీ వైద్యుల పట్టివేత

- టీజీఎంసీ బృందాల ప్రత్యేక దాడులు.. 16 మందిపై కేసులు
- ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో అక్రమ వైద్యం వెలుగులోకి
- రిజిస్టర్డ్ వైద్యురాలికి షోకాజ్ నోటీసులు.. పరారీలో మరో ఇద్దరు




కాకతీయ, తెలంగాణ బ్యూరో : వరంగల్ నగరంలో నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) ఉక్కుపాదం మోపింది. పోలీసుల సహకారంతో శివనగర్, కరిమాబాద్, కీర్తినగర్, కాజీపేట, ఊరుగొండ, ఉర్సు, ఫోర్ట్ వరంగల్ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్న 16 మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసింది. ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధంగా క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు మండలి వెల్లడించింది. తనిఖీల్లో అపరిశుభ్ర వాతావరణంలో చికిత్సలు నిర్వహించడం, అనుమతి లేకుండా క్లినిక్‌లు నడపడం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో బెడ్లు ఏర్పాటు చేసి రోగులను చేర్చుకోవడం, సెలైన్‌లు, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, ఇతర మందులతో చికిత్సలు అందించడం, వాడిన సిరంజీలు, సూదులు, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ చెత్తలో పడేయడం వంటి తీవ్ర ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చినట్లు టీజీఎంసీ తెలిపింది. తెలంగాణ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం, నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం తదితర నిబంధనల ప్రకారం సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి కేసులు నమోదు చేయించారు.

### 16 మంది నకిలీ వైద్యులపై కేసులు

కేసులు నమోదైన వారిలో ఎ. రాములు (శివనగర్), కమలాకర్ (జయశ్రీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కీర్తినగర్), బండి రమేష్ (శ్వేత ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శివనగర్), వెంకటేశ్వర్లు (వెంకటేశ్వర క్లినిక్, కీర్తినగర్), బాబురావు (శివనగర్), ఎ. రమేష్ (కావ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ఫోర్ట్ రోడ్), కృష్ణమూర్తి (కరిమాబాద్), టి. రాజమౌళి (విజయదుర్గ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కరిమాబాద్), శివశంకర్ (ఉర్సు), గడ్డం హరీష్ (ఉర్సు), గడ్డం శ్రీనివాస్ (ఉర్సు), ఎం. సిద్దేశ్వర్ (జయలక్ష్మి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, కరిమాబాద్), జి. రామకృష్ణ (ఫోర్ట్ వరంగల్), కుమారస్వామి (కాజీపేట), సుధాకర్ (కాజీపేట), జి. వెంకటరాములు (ఊరుగొండ) ఉన్నారు.

తరువాయి 2లో



## మృతదేహానికి వైద్యం చేశారా..?

- చికిత్స పేరుతో బిల్లులు వేశారా..?!
- హనుమకొండ ప్రైవేట్ ఆసుపత్రిపై కుటుంబ సభ్యుల తీవ్ర ఆరోపణలు
- సమగ్ర విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని అధికారులకు వినతి

2లో

# రాయదుర్గం భూముల కేసులో డ్రోన్ సర్వేకు బ్రేక్

**హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే**

**యథాతథ స్థితి కొనసాగించాలని కీలక ఆదేశాలు**

**హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి అవకాశం**

న్యూఢిల్లీ : రాయదుర్గం భూముల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై తాత్కాలికంగా స్టే విధిస్తూ యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. టీజీఐఐసీ తరఫు న్యాయవాది వాదనలు వినకుండానే హైకోర్టు డ్రోన్ సర్వేకు ఆదేశాలు ఇచ్చిందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అన్ని పక్షాల వాదనలు పూర్తిగా వినాల్సిన అవసరం ఉందని భావించిన ధర్మాసనం డ్రోన్ సర్వేను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారంలో హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఇందుకోసం ఆగస్టు 14వ తేదీ వరకు గడువు కల్పిస్తూ, ఆలోగా హైకోర్టులో సవరణ దరఖాస్తు దాఖలు చేయాలని సూచించింది. రాయదుర్గం సర్వే నంబర్ 83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేయాలనే ప్రతిపాదన ప్రస్తుతం లేదని టీజీఐఐసీ తరఫు సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం తదుపరి విచారణ హైకోర్టులో కొనసాగనుంది.

## వరంగల్‌లో నకిలీ వైద్యుల పట్టివేత

**రిజిస్ట్రేషన్ దుర్వినియోగంపై చర్యలు**

కావ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు ఎ. రమేష్‌కు తన వైద్య రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను దుర్వినియోగానికి ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించడంతో ఎంబీబీఎస్ వైద్యురాలు డా. శ్రీహితకు తెలంగాణ వైద్య మండలి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించింది. నమోదిత వైద్యులు తమ రిజిస్ట్రేషన్‌ను ఇతరులు వినియోగించుకునేలా ఇవ్వడం తీవ్రమైన వృత్తిపరమైన ఉల్లంఘనగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. అబార్షన్లు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నకిలీ వైద్యుడు రుద్ర భాస్కర్ తనిఖీల సమయంలో పరారైనట్లు అధికారులు తెలిపారు. అలాగే శివనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ కేసుల భయం, అమెరికా వీసాపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో తనిఖీల సమాచారం అందగానే క్లినిక్‌లోని బెడ్లు, వైద్య పరికరాలు, వాడిన సిరంజీలు, మందుల సీసాలు తదితర సామగ్రిని తొలగించినట్లు గుర్తించారు.

## ఏన్కూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా గోవిందు శ్రీనివాసరావు



కాకతీయ, ఏన్కూర్/తల్లాడ: టీపీసీసీ ఆదేశాల మేరకు ఏన్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ను మర్యాదపూర్వకంగా కలవగా, ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేసి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గోవిందు శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ కమిటీల ఏర్పాటులో పారదర్శకత పాటిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జయశంకర్ ను మరచిన జన నాయకులు..

- జయశంకర్ విగ్రహానికి దూరంగా ప్రజా ప్రతినిధులు
- కనీస పులా మాలలు వేయని అధికార,ప్రతిపక్ష పార్టీలు
- మండల కేంద్రంలో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు కరువు
- ఉద్యమ నేతను పట్టించుకోని పార్టీల నాయకులు
- సోషల్ మీడియాకే పరిమితమైన జయశంకర్ జయంతి వేడుకలు

కాకతీయ,ఆత్మకూరు : సోషల్ మీడియాకే పరిమితమైన తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు.గురువారం తెలంగాణ సిద్ధాంత కర్త కొత్తపల్లి జయశంకర్ జయంతి కాగా హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని అధికార,ప్రతిపక్షాల పార్టీలు మరవడం సిగ్గు చేటని ఆత్మకూరు గ్రామా ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంలోని కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి ఏ పార్టీ నాయకులు పులా మల వేయకపోవడం గ్రామా ప్రజలు అధికార ప్రతిపక్ష నాయకుల పై గుస్సా చేస్తున్నారు. పార్టీ ఆవిర్భవాలు ఘనంగా చేసే నాయకులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తన జీవితాన్ని త్యాగం చేసిన జయశంకర్ ను మరవడం పై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పార్టీల ఆవిర్భావాలు,బడా నాయకుల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించే పార్టీ నాయకులు ఆత్మకూరు మండల కేంద్రంలోని జయశంకర్ విగ్రహాన్ని మరవడం సిగ్గు చేటని గ్రామస్తులు తెలుపుతున్నారు.ఆత్మకూరు మండల ప్రజా ప్రతినిధులు సోషల్ మీడియాలో మాత్రం జయశంకర్ జయంతి పై పోస్టులు పెట్టడం గమనాహారం..

**--ఉద్యమ నాయకునికి ఉద్యమ కారుల పూల మాలలు.**

- జయశంకర్ విగ్రహానికి ఒక్క పూల మల పడకపోవడం సిగ్గుచేటు
- హనుమకొండ జిల్లా ఉద్యమకారుల ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం

తెలంగాణ సిద్ధాంత కర్త కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూల మల వేయడం జరిగిందని హనుమకొండ జిల్లా ఉద్యమకారుల ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం తెలిపారు.అనంతరం ఇర్సడ్ల సదానందం మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తన జీవితాన్ని త్యాగం చేసిన జయ శంకర్ ను ఆత్మకూరు మండల ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు ఉదయం నుంచి జయశంకర్ విగ్రహానికి ఒక్క పూల మాల వేయకపోవడం సిగ్గు చేటని అన్నారు.అనంతరం మండల ఉద్యమ కమిటీ ఆధ్వరంలో పూలమాలలు వేసి నినాదాలు చేసారు..

# మారుతోందా ఆర్ఎస్ఎస్ స్వరం..?

(మొదటి పేజీ తరువాయి)

గతంలో నిరసనలు తెలిపే విద్యార్థి సంఘాలు లేదా యువతపై సంఘ్ పరివార్‌కు చెందిన నాయకుల నుంచి విమర్శలు ఎక్కువగా వినిపించేవి. ఇప్పుడు మాత్రం వారిని అర్థం చేసుకోవాలనే సందేశం ఇవ్వడం గమనార్హంగా మారింది. మోహన్ భాగవత్ ప్రసంగంలో యువత ప్రశ్నించే హక్కును సమర్థించడం, నిరసనలను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా పేర్కొనడం... సంఘ్ నుంచి గతంలో వినిపించిన కఠిన వ్యాఖ్యలతో పోలిస్తే భిన్నమైన సంకేతంగా కనిపిస్తోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**ప్రజెంటేషన్ మారుతోందా?**

ఆర్ఎస్ఎస్ మూల సిద్ధాంతాల్లో ఎలాంటి మార్పు కనిపించకపోయినా... వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే విధానంలో మాత్రం గణనీయమైన మార్పు వస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. గతంలో విమర్శలకు ఘాటుగా స్పందించే ధోరణి కనిపించగా... ఇప్పుడు సంభాషణ, చర్చ, పరస్పర అవగాహన వంటి పదాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ యువత, ఐటీ రంగ ఉద్యోగులు, ఉన్నత విద్యావంతుల మధ్య తన ఆమోదాన్ని పెంచుకోవడానికి సంఘ్ పరివార్ భాషను మార్చుకుంటోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. "వ్యతిరేకించే వారిని శత్రువులుగా కాకుండా... వారితో మాట్లాడాల్సిన అవసరం ఉంది" అనే సందేశాన్ని భాగవత్ వ్యాఖ్యలు పరోక్షంగా సూచిస్తున్నాయనే విశ్లేషణ వినిపిస్తోంది. దేశ రాజకీయాల్లో ప్రతి ఎన్నికకు ముందు కొత్త సామాజిక వర్గాలను ఆకర్షించే ప్రయత్నం అన్ని పార్టీల్లో కనిపిస్తుంది. బీజేపీకి సిద్ధాంతపరమైన మార్గనిర్దేశం చేసే సంస్థగా భావించే ఆర్ఎస్ఎస్ కూడా కాలానుగుణంగా తన సందేశాలను సర్దుబాటు చేసుకుంటోందా అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం దేశ జనాభాలో అత్యధిక భాగం యువతే. మొదటిసారి ఓటు వేస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వారిని విమర్శించే ధోరణి కంటే... వారిని అర్థం చేసుకునే భాష రాజకీయంగా ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుందని సంఘ్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ప్రతిపక్షాల విమర్శలకు ముందస్తు సమాధానమా?**

ఇటీవలి కాలంలో భావ వ్యక్తీకరణ, విద్యార్థి ఉద్యమాలు, సోషల్ మీడియా పోస్టులు వంటి అంశాలపై బీజేపీ, సంఘ్ పరివార్‌పై ప్రతిపక్షాలు తరచూ విమర్శలు చేస్తున్నాయి. యువత స్వరాన్ని అణచివేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అలాంటి విమర్శలకు సమాధానంగా భాగవత్ వ్యాఖ్యలను కూడా కొందరు చూస్తున్నారు. యువతను దేశభక్తి కోణంలోనే కాకుండా... ప్రజాస్వామ్య భాగస్వాములుగా చూపించే ప్రయత్నం సంఘ్ నుంచి రావడం రాజకీయంగా కొత్త సంకేతంగా పరిగణిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ... జాతీయ స్థాయిలో రాజకీయ కథనాల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందనే అభిప్రాయం ఉంది. అలాంటి సమయంలో యువతను కేంద్రంగా చేసుకుని సానుకూల సందేశాలు ఇవ్వడం, కఠిన ఇమేజ్‌ను కొంత మృదువుగా మార్చే ప్రయత్నం చేయడం సంఘ్ వ్యూహంలో భాగమా అనే చర్చ జోరందుకుంది. అయితే ఒక ప్రసంగం ఆధారంగా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలో మార్పు వచ్చిందని చెప్పడం కంటే... మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా తన కమ్యూనికేషన్ శైలిని సవరించుకుంటోందని చెప్పడమే సముచితమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మృతదేహానికి వైద్యం చేశారా..?

- చికిత్స పేరుతో బిల్లులు వేశారా..?!
- హనుమకొండ ప్రైవేట్ ఆసుపత్రిపై కుటుంబ సభ్యుల తీవ్ర ఆరోపణలు
- సమగ్ర విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని అధికారులకు వినతి



కాకతీయ, హనుమకొండ: హనుమకొండలోని ఓ ప్రైవేట్ న్యూరో ఆసుపత్రిపై చికిత్స పేరుతో భారీ బిల్లులు వసూలు చేస్తున్నారంటూ రోగి కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. బ్రెయిన్ డెత్ సంభవించిన తర్వాత కూడా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స కొనసాగిస్తున్నట్లు చూపుతూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఆరోగ్యశ్రీ అధికారులు, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బుల్లికొండ గ్రామానికి చెందిన పంజాల శ్రీధర్ మెదడులో రక్తగడ్డ ఏర్పడటంతో తొలుత బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారని, అనంతరం విజయ టాకీస్ సమీపంలోని ఓ న్యూరో ఆసుపత్రికి తరలించి బ్రెయిన్ సర్జరీ నిర్వహించారని ఆయన తండ్రి జలంధర్ తెలిపారు. అయితే శస్త్రచికిత్స జరిగిన రెండు రోజుల నుంచే ఎలాంటి స్పందన లేదని, రోగి పరిస్థితిపై వైద్యులు స్పష్టత ఇవ్వకుండా "95 శాతం గ్యారెంటీ లేదు" అంటూ తప్పించుకుంటున్నారని ఆరోపించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఇప్పటికే భారీ మొత్తంలో బిల్లులు చెల్లించగా, ఆరోగ్యశ్రీ చికిత్స కొనసాగుతోందని చెబుతూనే సుమారు రూ.70 వేల వరకు నగదు కూడా వసూలు చేశారని పేర్కొన్నారు. పూర్తి బిల్లులు చెల్లించిన తర్వాతే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆసుపత్రి యాజమాన్యం ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు. శ్రీధర్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారని తెలిపారు.



బ్రెయిన్ డెత్ అనంతరం వెంటిలేటర్ సాయంతో గుండె కొట్టుకుంటున్నట్లు కనిపించే పరిస్థితిని ఆసరాగా చేసుకుని చికిత్స కొనసాగిస్తున్నట్లు చూపుతున్నారనే అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, వైద్య నిర్లక్ష్యం లేదా అక్రమాలు జరిగిఉంటేబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆసుపత్రి యాజమాన్యం స్పందన కోసం ఎదురుచూపు**

ఈ ఆరోపణలపై సంబంధిత ఆసుపత్రి యాజమాన్యం నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణలపై వారి వివరణ వచ్చిన తర్వాతే పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లా వైద్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ప్రభుత్వ పనుల పేరుతో ఇసుక అక్రమ రవాణా



**అనుమతి లేదని నిలిపేసిన తహశీల్దార్**

కాకతీయ,ఏటూరునాగారం,రూరల్ : ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని జంపన్నవాగులో రెవెన్యూ నిదంధనలు ఉల్లంఘించి జేసీబీ వాహనంతో ఇసుకను ట్రాక్టర్ల ద్వార రవాణా చేస్తున్నారనే సమాచారంతో గురువారం జాతీయ రహదారి 163 పై రెవెన్యూ సిబ్బంది రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. తహశీల్దార్ గుర్రం జగదీష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుండి గ్రామ పంచాయితీ జేసీబీ వాహనంతో జంపన్నవాగులోని ఇసుకను రెండు ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతుందని సమాచారం రావడంతో మా సిబ్బంది వెళ్ళి పరిశీలించగా రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. దీంతో జిల్లాపరిషత్ పాఠశాలలో కొనసాగుతున్న ప్రభుత్వ పనులకు సర్పంచ్ అనుమతితో రవాణా చేస్తున్నామని సదరు ట్రాక్టర్ యజమానులు తహశీల్దార్ కు తెలిపారన్నారు. వెంటనే తహశీల్దార్ ఎంపీడీవో శ్రీనివాసును ఫోన్ లో అడగగా ప్రభుత్వ పనులకే ఇసుక రవాణా చేస్తున్నామని తెలిపడంతో రెవెన్యూ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయడం నిబంధనలకు వ్యతిరేకం కదా అనడంతో అనుమతి అనంతరం ఇసుక రవాణా చేస్తామని నిలిపివేశారు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు**

**తహశీల్దార్ జగదీష్**

కొందరు వ్యక్తులు డీడీలు తీశామని కాలం చెల్లిన డీడీలతో, ప్రభుత్వ పనుల పేరుతో రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా ప్రైవేటు ఇంటి నిర్మాణాలకు ట్రాక్టర్లతో ఇసుక విక్రయిస్తున్నారని సమాచారం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక రవాణా చేపడితే ఎంతటి వారైన రెవెన్యూ శాఖ చర్యలు తప్పవని తహశీల్దార్ జగదీష్ హెచ్చరించారు.



## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్..!

(మొదటి పేజీ తరువాయి)

**ట్యాక్సేషన్ బిల్లుకూ ఆమోదం**

ఇదే సమావేశంలో ట్యాక్సేషన్ అండ్ అదర్ లాస్ (సవరణ) బిల్లును కూడా లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం భారత్‌లో ఎలక్ట్రానిక్స్ తయారీ కోసం కాంట్రాక్ట్ తయారీదారులను నియమించుకునే విదేశీ కంపెనీలకు ప్రస్తుతం అమల్లో ఉన్న ఆదాయపు పన్ను మినహాయింపును 2040–41 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగించారు. ఈ రాయితీ పరిధిలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పర్సనల్ కంప్యూటర్లు, ట్యాబ్లెట్లు, సర్వర్లు, వాటి కీలక భాగాలు, అనుబంధ పరికరాల తయారీ సంస్థలు ఉంటాయి. అలాగే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలను కస్టమ్స్ గిడ్డంగుల్లో నిల్వ చేసి భారతీయ కాంట్రాక్ట్ తయారీదారులకు సరఫరా చేసే విదేశీ కంపెనీలకు కూడా 15 సంవత్సరాల పాటు ఆదాయపు పన్ను మినహాయింపు కొనసాగించేందుకు బిల్లులో ప్రతిపాదనలు చేశారు.

**డేటా సెంటర్లకూ ఊతం**

భారతీయ డేటా సెంటర్లను వినియోగించే విదేశీ క్లౌడ్ కంపెనీలపై ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని అనుమతి, నోటిఫికేషన్ నిబంధనలను కూడా ఈ బిల్లు తొలగిస్తోంది. అలాగే భారతీయ డేటా సెంటర్లను ప్రత్యక్ష యాజమాన్యంతో పాటు లీజు విధానంలో నిర్వహించుకునే వెసులుబాటును కల్పిస్తోంది. ప్రపంచ స్థాయి పెట్టుబడులు, ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు, డిజిటల్ సేవల రంగాన్ని భారత్ వైపు మరింత ఆకర్షించడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశమని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఆమోదించిన ఏడో బిల్లు ఇదే కాగా, చర్చ లేకుండానే ఆమోదం పొందిన ఐదో బిల్లుగా ఇది నిలిచింది. అంతకుముందు పేపర్ లీక్ నిరోధక చట్ట సవరణ బిల్లుపై దాదాపు పది గంటల పాటు విస్తృత చర్చ నిర్వహించిన సభ, జాతీయ గేయం ★'వందేమాతరం'★ను అవమానించడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించే బిల్లుపై కూడా పరిమిత చర్చ అనంతరం ఆమోదం తెలిపింది. అయితే గురువారం మాత్రం విపక్షాల నిరసనల కారణంగా కీలక బిల్లులన్నీ చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందడం పార్లమెంటు కార్యకలాపాల్లో ప్రధాన పరిణామంగా నిలిచింది.

## గిగ్ వర్కర్లకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలు, బీమా ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయి. అలాగే కంపెనీలు గిగ్ వర్కర్లకు చెల్లింపులను సకాలంలో చేయాల్సి ఉంటుంది. అగ్రిగేటర్ సంస్థలు ప్రతి 60 రోజులకు ఒకసారి తమ వద్ద పనిచేస్తున్న గిగ్ వర్కర్ల వివరాలను సంక్షేమ బోర్డుకు సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాకుండా గిగ్ వర్కర్లకు చెల్లించే మొత్తంలో 1 నుంచి 2 శాతం వరకు సంక్షేమ నిధికి జమ చేయాల్సి ఉంటుంది. చట్ట నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై రూ.50 వేల వరకు జరిమానా విధించే నిబంధనను ప్రభుత్వం చేర్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మంది గిగ్ వర్కర్లు ఫుడ్ డెలివరీ, ఈ–కామర్స్, క్యాబ్ సేవలు తదితర రంగాల్లో పనిచేస్తున్నారు. ఉద్యోగ భద్రత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ వర్గానికి చట్టపరమైన రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఏడాది డిసెంబర్‌లో గిగ్ వర్కర్లు, అగ్రిగేటర్ సంస్థల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను పరిశీలించారు. అనంతరం రూపొందించిన ముసాయిదా బిల్లుపై వచ్చిన 250కిపైగా సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేసి శాసనసభ ఆమోదించింది. ఈ చట్టంతో గిగ్ వర్కర్లకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్న దేశంలోని ఐదో రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

## దాడి యత్నం.. పోలీసులపై ఆరోపణలు

మణికొండలోని రూపా రెడ్డి నివాసంపై కొందరు దాడికి పాల్పడ్డారని, ప్రాణభయంతో డయల్–100కు ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదని సంతోష్ గౌడ్ వాపోయారు. అధికార ఒత్తిళ్ల కారణంగానే తమ ఫిర్యాదును పట్టించుకోలేదని, అందుకే మీడియా ముందుకు వచ్చి తమ గోడు వినిపించాల్సి వచ్చిందన్నారు. రూపా రెడ్డి కూడా మీడియాతో మాట్లాడుతూ తమపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రక్షణ కల్పించాల్సిన వ్యవస్థ తమను నిర్లక్ష్యం చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కొడుకు చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాత్రం తీవ్రంగా స్పందించారు. "వాడు ఎవడో నాకు తెలియదు. వాడితో నాకు ఎలాంటి సంబంధం లేదు. సరైన సమయంలో ఈ అంశంపై పూర్తి వివరాలు చెబుతాను" అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దీనిపై అంతకుమించి మాట్లాడబోనని స్పష్టం చేశారు. వ్యక్తిగత కుటుంబ వివాదంగా మొదలైన ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే ఇరు పక్షాలు చేస్తున్న ఆరోపణలు, ప్రతిఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఈ వివాదం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రజల్లోకి కాక్రోచ్ జనతా పార్టీ..

(మొదటి పేజీ తరువాయి)

**విద్యా సంస్కరణలే తొలి ప్రాధాన్యం**

ప్రస్తుతం దేశ రాజకీయాల్లో విద్య, నిరుద్యోగం వంటి కీలక అంశాలు చర్చకు రావడం లేదని సీజేపీ నేతలు విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పెరుగుతున్న ఫీజులు, విరాళాల విధానం వల్ల విద్య సామాన్య కుటుంబాలకు భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యను వ్యాపారంగా కాకుండా ప్రతి పౌరుడి మౌలిక హక్కుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయం, మహాత్మా గాంధీ అహింస, జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక భారత దృక్పథమే తమ పార్టీ సిద్ధాంతాలకు ఆధారమని నేతలు తెలిపారు. ఎన్నికల వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియాపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని, సంస్థాగత జవాబుదారీతనం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీగా కాకుండా ప్రజల ఒత్తిడి వేదికగా పనిచేస్తామని స్పష్టం చేసిన సీజేపీ నేతలు దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పార్టీ ఎలాంటి విరాళాలు లేదా క్రౌడ్‌ఫండింగ్ స్వీకరించడం లేదని, పార్టీ పేరుతో నిధుల సేకరణకు ప్రయత్నించే మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## మేచరాజుపల్లిలో జయశంకర్ జయంతి

**చిత్రపటానికి నివాళులర్పించిన గ్రామస్తులు**



కాకతీయ, నెల్లికుదురు: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయశంకర్ జయంతిని గురువారం మేచరాజుపల్లిలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ తూర్పాటి శంకరయ్య, ఉపసర్పంచ్ తాళ్లపల్లి వెంకన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి హజ్మతుల్లా, పీఏసీఎస్ డైరెక్టర్ కొయ్యడి వెంకన్న, కారోబార్ ధూబర్ల సాయిలు, వార్డు సభ్యుడు జక్కుల యాకన్న, ఉపాధ్యాయులు స్వామి, మొరపోజు శ్రీను, సంపత్, అంగన్‌వాడీ టీచర్లు లీలావతి, మైబు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**: కమిషనర్ వెంకన్న**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జయశంకర్ 93వ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజాసేవలో ఆయన చూపిన నిబద్ధత అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, ఉప కమిషనర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం : రవీందర్ రెడ్డి



కాకతీయ, పెద్దవంగర: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అంకితభావంతో కృషి చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సంకెపల్లి రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం పెద్దవంగర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఆవిర్భావానికి ఆయన అందించిన భావజాలం, చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజ అభ్యున్నతి, ప్రాంతీయ సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం జయశంకర్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ రవి, ఉపసర్పంచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు ఏర్పాట్లు
# గడువులోగా పూర్తి చేయాలి

**ములుగు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు ఆదేశం**

**భద్రత, మౌలిక సదుపాయాలపై సమీక్ష**



కాకతీయ, ములుగు ప్రతినిధి: ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆగస్టు 12లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, హెలిప్యాడ్లు, వీఐపీ బస, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య, భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. శాఖల మధ్య సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సీఎం పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### హెచ్.ఎం నరేంద్ర కుమార్ కు పలువురి పరామర్శ



కాకతీయ,నెల్లికుదురు: మండల కేంద్రం నెల్లికుదురుకు చెందిన పర్వతమ్మ గూడెం యుపిఎస్ హెచ్.ఎం.హెచ్చు నరేంద్ర కుమార్ సతీమణి కాంగ్రెస్ సీనియర్ మండల నేత అలివేలు ఇటీవల హఠాత్తుగా కన్నుమూశారు.సమాచారం తెలుసుకున్న ఎంఈఓ రాందాస్ తో పాటు పలువురు ఉపాధ్యాయులు, జర్నలిస్టులు గురువారం స్వర్గీయ అలివేలు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ప్రజా నాయకురాలుగా పేరుపొందిన అలివేలు అకస్మాత్తుగా పరమపదించడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.నరేంద్ర కుమార్ సార్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ ఆపత్కాలంలో మనోధైర్యాన్ని కోల్పోవద్దని ధైర్య వచనాలు చెప్పారు. పరామర్శించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు పంజాల వాసుదేవ గౌడ్,బొలగాని యాకయ్య గౌడ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు చెడుపల్లి ఐలయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్, పెరుమాండ్ల యాకయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

# స్వప్నకు అండగా బీఆర్ఎస్

**వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**



**మాజీ సీఎం కేసీఆర్**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ఇటీవల అకాల మరణం చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. గురువారం నెక్కొండ మండల కేంద్రంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు కొమ్ము రమేష్ యాదవ్ ఇంట్లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అరూరి రమేష్ మాట్లాడు తూ, సుదర్శన్ రెడ్డి లేరని అధైర్యపడవద్దని కార్యకర్తలకు సూచించారు. సుదర్శన్ రెడ్డికి ఎలా అండగా నిలిచారో, అదే విధంగా ఆయన సతీమణి పెద్ది స్వప్నకు కూడా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

స్వప్న కుటుంబానికి అండగా ఉంటారని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. మీకు అండగా పెద్ది స్వప్న, మండల నాయకత్వం, మేము ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు బలవంతంగా కేసులు నమోదు చేస్తున్నారని, అందుకు భయపడవద్దని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సీనియర్ నాయకుడు కొమ్ము రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ చైర్మన్ గుంటుక సోమయ్య, రవి, వీరభద్రం, వెంకన్న, వివి ధ గ్రామాల సర్పంచ్లు, మాజీ సర్పంచ్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి
# కాకతీయ ఘన నివాళి










- **కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎడిటర్ కిరణ్ గౌడ్**
- **పెద్ది స్వప్నకు మనోధైర్యం.. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి**
- **ప్రత్యేక కథనాన్ని చిత్రపటం రూపంలో అందజేసిన పాత్రికేయ బృందం**

కాకతీయ, నల్లబెల్లి : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి జీవితాంతం కృషి చేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి కాకతీయ దినపత్రిక బృందం గురువారం ఘనంగా నివాళులర్పించింది. కాకతీయ దినపత్రిక ఎడిటర్ అరెల్లి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో బృందం నల్లబెల్లిలోని ఆయన స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించింది. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్నను పరామర్శించిన ఎడిటర్ కిరణ్ , ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెద్ది సుదర్శన్ రెడ్డి లేని లోటు రాజకీయాలకు మాత్రమే కాకుండా తెలంగాణ సమాజానికే తీరని నష్టమని పేర్కొన్నారు.కుటుంబానికి కాకతీయ దినపత్రిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తూ నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని అన్నారు. తనకు పెద్ది సుదర్శన్ రెడ్డితో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన ప్రజల పట్ల ఉన్న అంకితభావం, నిరాడంబర జీవనం, అందరినీ కలుపుకుపోయే వ్యక్తిత్వం చిరకాలం గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాసేవ భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మరణించిన రోజు కాకతీయ దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనాన్ని చిత్రపటం రూపంలో రూపొందించి పెద్ది స్వప్నకు అందజేశారు. కార్యక్రమంలో కాకతీయ దినపత్రిక ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో సందీప్, ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సుమన్, నల్లబెల్లి రిపోర్టర్ కిరణ్ పాల్గొన్నారు.

## హెపటైటిస్ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

**కలెక్టర్ సత్య శారద**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : జాతీయ వైరల్ హెపటైటిస్ (ఎన్ వి హెచ్ సి పి) నియంత్రణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జాతీయ వైరల్ హైపటైటిస్ కార్యక్రమం అమలులో భాగంగా గురువారం జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ డా సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హై-రిస్క్ గ్రూపులకు హెపటైటిస్-బి వ్యాక్సినేషన్ ను పూర్తి స్థాయిలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.
హెపటైటిస్-ఎ, హెపటైటిస్-ఈ వ్యాప్తిని నివారించేందుకు తాగునీటి వనరుల క్లోరినేషన్ ను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. హెపటైటిస్ లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, రక్తదాతలకు తప్పనిసరిగా హెపటైటిస్ స్క్రీనింగ్ చేయాలని తెలిపారు.
హై-రిస్క్ గ్రూపులతో పాటు సాధారణ ప్రజల్లోనూ హెపటైటిస్ వ్యాధిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జిల్లాలో వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేసి, వ్యాధి నివారణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ వో డా బి రాజారెడ్డి, నర్సంపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. దామోదరి, జిల్లా వైరల్ హెపటైటిస్ నోడల్ అధికారి డా ఉష, డీసీహెచ్ఎస్ డా రాంమూర్తి, డిప్యూటీ డీఎంహెచ్ వో డా రాజమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి డా సంయుక్త, సభ్యులు స్వప్న మాధురి, లైలా, చందు, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలరాజు గౌడ్



కాకతీయ, గీసుగొం డ: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగదేవిపల్లి గ్రామా నికి చెందిన గడ్డమీద బాలరాజు గౌడ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా బాలరాజు గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలి పారు. తన నియామకానికి సహకరించిన డా. కాళీ ప్రసాద్, కొలను సంతోష్ రెడ్డి, డా. విజయ చందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బలవంతుల రాజులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ఓబీసీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని, కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

### కాకతీయుల కళాసంపదను కాపాడుకోవాలి

**రిటైడ్ ఐఏఎస్ కె .ఛాత్రత్**



కాకతీయ, ఆత్మకూరు : కాకతీయులు కళ సంపదను కాపాడుకోవాలని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన రిటైడ్ ఐఏఎస్ కె .ఛాత్రత్ అన్నారు.గురువారం ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలోని త్రికూట శివాలయంను సందర్శించారు. వారికీ గ్రామా సర్పంచ్ షబానా గాఫుర్ సాదరంగా ఆహ్వానం పలికారు.అనంతరం రిటైడ్ ఐఏఎస్ కె .ఛాత్రత్ మాట్లాడుతు కాకతీయులనాటి కళ సంపాదను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు.కాకతీయల నాటి త్రికూట శివాలయాన్ని తీర్చిదిద్దాలని త్రికూట శివాలయా అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్శనలో ఉప సర్పంచ్ మనోజ్,వార్డ్ మెంబర్లు సతీష్,మొగిలి,శ్రీను,రాజు,గ్రామ పెద్దలు బిక్షపతి,మనోహర్ రెడ్డి,రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జయశంకర్ జయంతి నిర్వహణలో నిర్లక్ష్యం?

- **ఏనుమాముల మార్కెట్ అధికారుల తీరుపై విమర్శలు**
- **సాయంత్రం మాత్రమే విగ్రహానికి నివాళులు**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఏనుమాముల మార్కెట్ అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం చేశారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచే జయంతి వేడుకలు నిర్వహిస్తుండగా, ఏనుమాముల మార్కెట్‌లో ఆయ న విగ్రహానికి పూలమాల కూడా వేయకపోవడం చర్చనీయాంశమైంది. సాయంత్రం ఐదు గంటల సమయంలో మాత్రమే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉద్యోగులు పేర్కొ న్నారు. తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకుడైన జయశంకర్‌కు తగిన గౌరవం ఇవ్వడంలో మార్కెట్ యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి

- **ఆత్మకూరులో జయంతి వేడుకలు**
- **తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి పిలుపు**



కాకతీయ, ఆత్మకూరు: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను కొనసాగించాలని ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం అక్కంపేట గ్రామంలో సర్పంచ్ ముద్దం సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతపై పలు గ్రంథాలు రచించి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐసంతోష్, నాయకులు ముద్దంకృష్ణ, చిలువేరు రాజు పాల్గొన్నారు.

## 16న ములుగుకు సీఎం రేవంత్ రెడ్డి

- **మేడారం అభివృద్ధి పనుల పరిశీలన**
- **సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవం**



కాకతీయ, ములుగు ప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 16న ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో మేడారం సమ్మక్క–సారలమ్మ దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు, ములుగు పట్టణంలో నూతన నంగా నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం ముందుగా మేడారం చేరుకుని సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉంది. అనంతరం మేడారం మాస్టర్‌ప్లాన్ కింద చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. జాతరకు శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన, భక్తులకు మెరుగైన సౌకర్యాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. తర్వాత ములుగు పట్టణంలోని గట్టమ్మ దేవాలయం సమీపంలో నిర్మించిన సమీకృత జిల్లా కలెక్టరేట్‌ను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం హెలిప్యాడ్, భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లను వేగవంతం చేసింది.

### దీర్ఘకాలిక సమస్య పరిష్కారం :

**సర్పంచ్ కవిత**

కాకతీయ, పెద్దవంగర : మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని మోత్య తండ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం విద్యుత్ స్తంభాల అప్‌గ్రేడేషన్ భాగంగా నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దింతో శిథిలావస్థలో ఉన్న పాత స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి అమర్చారు. ఈ చర్యతో గ్రామస్తుల దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైందని సర్పంచ్ కవిత, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## తెలంగాణ స్ఫూర్తి జయశంకర్ సార్‌దే

- ఖమ్మం తెలంగాణ భవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు
- ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పిలుపు



కాకతీయ, ఖమ్మం : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను శుక్రవారం ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ, మలిదశ తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేసి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో రగిలించిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ సాధన కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర, మండల పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, భాషబోయిన వీరన్న, కనగాల వెంకటరావు, మాజీ లైబ్రరీ చైర్మన్ ఖమర్, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ఉప్పల వెంకట రమణ, బొమ్మెర రామ్మూర్తి, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ కార్పొరేటర్లు షేక్ మక్బూల్, తోట రామారావు, ఉద్యమకారులు పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, ఆసిఫ్, బురాన్, బొడ్డు గ్లోరి, రాజేష్, నాయకులు తాజుద్దీన్, మాటేటి నాగేశ్వరరావు, బుర్రి వెంకటేశ్వర్లు, బిరెడ్డి నాగచంద్రారెడ్డి, ముత్యాల వెంకటప్పారావు, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, యలమద్ది రవి, బోజెడ్ల రాంమోహన్, షేక్ షకీనా, బాసిపొంగు వెంకటేశ్వరరావు, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ ఎజెండా

- భూ సమస్యలు పరిష్కరించి అర్హులందరికీ పట్టాదారు పాస్‌బుక్‌లు
- రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి
- కూసుమంచిలో రూ.6.74 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కాకతీయ, ఖమ్మం బ్యూరో/కూసుమంచి : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురు వారం కూసుమంచి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్తో కలిసి పర్యటించిన మంత్రి సుమారు రూ.6.74 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశా రు. రాజుపేట బజార్–భద్రు తండా మధ్య రూ.1.76 కోట్ల తో బీటీ రోడ్డు, ఈశ్వరమాదారం–తాళ్లగడ్డ తండా వరకు రూ.50 లక్షల రోడ్డు, చౌటుపల్లిలో రూ.3.20 కోట్ల హై లెవల్ బ్రిడ్జి, లింగారం తండాలో రూ.1.28 కోట్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మంత్రి మాట్లా డుతూ, లింగారం తండాలో ఇప్పటికే రూ.5.45 కోట్ల అభి వృద్ధి పనులు చేపట్టామని, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధా న్యం ఇస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధం గా తెలంగాణలో రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

### రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు

రాష్ట్రంలోని భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, పాలేరు ప్రాంతంలో రీ–సర్వే చేపట్టి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు అందజేస్తామని మంత్రి తెలిపారు. నకిలీ పాస్‌బుక్‌లను రద్దు చేసి, సర్వే ఆధారంగా అసలైన హక్కుదారులకు భూమి హక్కులు కల్పిస్తామని స్పష్టం చేశారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున జమ చేశామని, సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. అనంతరం లింగారం తండాలో రైతులతో కలిసి పొలంలోకి దిగి ఎద్దులతో స్వయంగా దుక్కి దున్ని, వ్యవసాయ పరిస్థితులపై ఆరా తీశారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీవైఎస్‌వో సునీల్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు,స్థానికప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మంను ప్రభుత్వం గాలికొదిలేసింది






- ముగ్గురు మంత్రులున్నా.. నగరాన్ని సమస్యల కూపంగా మార్చేశారు
- చెత్త కుప్పలే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం
- ఖమ్మం పట్టణ బీఆర్ఎస్ నాయకుల ధ్వజం
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేషన్ ముట్టడి
- డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం

కాకతీయ, ఖమ్మం: ఖమ్మం నగరాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల మయంగా మార్చేసిందని, ప్రజల కష్టాలను పూర్తిగా గాలికొదిలేసిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించి డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగర పాలన పూర్తిగా గాడితప్పిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా పాలకులు కాలం గడుపుతున్నారని ధ్వజమెత్తారు.

### చెత్త కుప్పలే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం

నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, చెత్తను రోజుల తరబడి తొలగించక ప్రజలను రోగాల బారిన పడేలా చేస్తున్నారని ఆరోపించారు. వీధి దీపాలు వెలగక ప్రజలు రాత్రివేళ భయాందోళనలకు గురవుతున్నారని, గుంతలమయమైన రహదారులతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని అన్నారు. పార్కులు నిర్లక్ష్యానికి గురై ప్రజలకు వినియోగం లేకుండా పోయాయని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు, నీటి కనెక్షన్ల మంజూరు, ఇంటి పన్నుల వ్యవహారం, మున్సిపల్ డీజిల్ వినియోగం, పబ్లిక్ టాయిలెట్లకు అనుబంధంగా షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన వారిని కాపాడే ప్రయత్నాలు మానుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉద్ధృతంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఖమ్మం ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటక కృష్ణ, మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, మాజీ కార్పొరేటర్లు బిక్కసాని ప్రశాంతలక్ష్మి, పల్లా రోషిలిని, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, మాటేటి నాగేశ్వర రావు, కూరాకుల వల్లరాజుతో పాటు తాజుద్దీన్, గొల్లపూడి రాంప్రసాద్, దేవభక్తిని కిషోర్, జస్వంత్, సద్దాం షేక్, మాటేటి కిరణ్, మోరంపూడి సాయి, షకీన, ఉస్మాన్, వీరేందర్, అశోక్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## సుందరగిరిలో నెరవేరిన 'బతుకమ్మ ఘాట్' రహదారి కల

- రూ.30 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సర్పంచ్, గ్రామస్థుల కృతజ్ఞతలు



కాకతీయ ,చిగురుమామిడి : మండలంలోని సుందరగిరి గ్రామంలో బతుకమ్మ ఆటస్థలం వరకు వెళ్లే రోడ్డు తో పాటు ఇప్పల్లపల్లె నుండి వెళ్లే మార్గాల్లో దశాబ్దాలుగా ఉన్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. రూ.30 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రెండు సీసీ రహదారుల నిర్మాణం పూర్తయింది. ఈ రోడ్ల నిర్మాణం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి మాట్లాడుతూ.. తన హయాంలో గ్రామానికి ఎంతో కీలకమైన ఈ రెండు సీసీ రహదారుల నిర్మాణం పూర్తి కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన రహదారుల వల్ల బతుకమ్మ పండుగ సమయంలో మహిళలకు రవాణా కష్టాలు తీరడంతో పాటు, నిత్యం పొలాలకు వెళ్లే రైతులకు, మత్స్యకారులకు, గౌడ కార్మికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. సుందరగిరి దశాబ్దాల కలను గుర్తించి, రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గ్రామం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### బోర్డు నేలకూలినా.. నిద్రలోనే మార్కెట్ యంత్రాంగం

కాకతీయ, ఏన్కూరు: ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్‌లో అధికారుల నిర్లక్ష్యం మరోసారి బహిర్గతమైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ తర్వాత అత్యధిక ఆదాయం సమకూర్చే మార్కెట్లలో ఒకటైన ఏన్కూరు మార్కెట్‌కు గుర్తింపుగా ఉన్న ప్రధాన బోర్డు రోజులుగా నేలపై పడివున్నా దానిని తిరిగి ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో సెక్రటరీ, ఇద్దరు సూపర్‌వైజర్లు, సుమారు ఆరుగురు సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ, మార్కెట్ నిర్వహణలో కనీస బాధ్యత కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన ద్వారం వద్ద బోర్డు నేలకూలి ఉండటం మార్కెట్ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని స్థానికులు అంటున్నారు.

### హుస్నాబాద్ టు కొత్తపల్లి నాలుగు వరుసల

## రోడ్డు విస్తరణకు హైకోర్టు బ్రేక్




కాకతీయ,చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామం నుండి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ వ్యవహారంలో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో నాలుగు వరసల రహదారి విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నాలుగు వరుసల రహదారి విస్తరణ అంశంపై దాఖలైన రిట్ పిటిషన్లపై బాధితులకు స్టేటస్ కో (యధాతథ స్థితి) కొనసాగించాలని ఆదేశిస్తూ హైకోర్టు ఉపశమనం కల్పించింది. మొదట ప్రధాన పిటిషనర్ కందుకూరి లక్షణాచారి, కక్కెర్ల బాలయ్య, కెమ్మసాగరం వెంకటయ్య, ఓరుగంటి భారతీ దేవి, వంతడుపుల మల్లయ్య, పిట్టల రమేష్, గైని శ్రీనివాస్, బోల్లబతిని రాజేశం, మొలుగూరి వెంకటాద్రి, వంతడుపుల వినయ్, సిలుమోజు యశోద మొదలైన 11 మంది దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై ఆగస్ట్ 4న విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరపల్లి నంద గారు 11 మంది మందికి చెందిన ఆస్తులపై ప్రస్తుతం ఉన్న పరిస్థితి కొనసాగించాలని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు స్టేటస్ కో జారీ చేశారు. దీంతో పిటిషన్ బాధితులకు హైకోర్టు తాత్కాలిక రక్షణ కల్పించింది. వాదన ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కి , సర్పంచ్ కి ఇండ్ల కూల్చివేతపై ఎలాంటి అధికారాలు ఉన్నాయని గ్రామ ప్రజలకు నోటీసులు జారీ చేశారని తెలిపారు , అధికారులు చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా, భవిష్యత్తులో 4, 6 వరుసల రహదారి నిర్మాణం బైపాస్ ద్వారా రోడ్డు నిర్మిస్తే బాగుంటందనే విషయం ఆలోచించకుండ , నష్టపరిహారం చెల్లించకుండానే రోడ్డు విస్తరణ పేరుతో తమ ఆస్తులపై చర్యలకు సిద్ధమవుతున్నారని కోర్టు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. పిటిషనర్ల తరపున న్యాయవాదులు వి.వెంకట సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాస్ రెడ్డి వాదనలు వినిపించడం జరిగింది. దీనిపై స్పందించిన హైకోర్టు తదుపరి విచారణ వరకు ఆస్తులపై కూల్చివేయడం స్వాధీనం లేదా ఇతర జోక్య చర్యలు చేపట్టరాదని స్పష్టం చేస్తూ స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 11 2026 కు వాయిదా పడింది. ఈ నాలుగు వరసల రహదారి విస్తరణ అంశంపై పిటిషనర్లుకు హైకోర్టులో స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేయడం హుస్నాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశంగా మారింది. చట్టబద్ధమైన ప్రక్రియ ప్రజల అభ్యంతరాల పరిశీలన, భవిష్యత్తులో4,6 వరుసల రోడ్డుకు, నేషనల్ రోడ్డుకు, గ్రీన్ ఫీల్డ్ రహదారికి బైపాస్ రోడ్డు అనుకూలమని ప్రతిపాదన, అదేవిధంగా ఉత్తర తెలంగాణ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తులో మంచి ప్రదాన రాష్ట్ర, జాతీయరహదారి నిర్మించాలంటే బైపాస్ రోడ్డు ద్వారానే నిర్మించాలని, తగిన నష్టపరిహారం వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయని న్యాయవార్గాలు అభిప్రాయపడుతున్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సాయిని మల్లేశం

### పార్టీ బలోపేతానికి కృషి చేస్తా కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు



కాకతీయ, కరీంనగర్ : కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశం హర్షం వ్యక్తం చేశారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు, పార్టీ జాతీయ నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు ధన్యవాదాలు తెలియజేసిన మల్లేశం.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశయాలు, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ కుటుంబ సభ్యుల సహకారంతో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.తన నియామకాన్ని స్వాగతిస్తూ అభినందనలు తెలిపిన పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులందరికీ సాయిని మల్లేశం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కరీంనగర్ వేదికగా జనసేన శక్తి ప్రదర్శన

- ఆత్మీయ సభను విజయవంతం చేయండి
- కందుల రాజిరెడ్డి



కాకతీయ, కరీంనగర్ : ఈ నెల 9న కరీంనగర్‌లో నిర్వహించనున్న జనసేన ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకుడు కందుల రాజిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు భగత్‌నగర్‌లోని శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆగస్టు 9న వాసర గార్డెన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనసేన ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ హాజరవుతారని చెప్పారు. ఉదయం 8 గంటలకు చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ పార్లమెంట్ స్థాయి కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, మార్కెట్ రోడ్డులోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం వాసర గార్డెన్‌కు ర్యాలీగా చేరుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన చేరికల కార్యక్రమంలో కరీంనగర్‌కు చెందిన సుమారు 50 మంది జనసేనలో చేరారు. వారికి కందుల రాజిరెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, మహిళా నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.5వేల లంచం తీసుకుంటూ జీపీఓ పట్టివేత

### పేరు సవరణ నివేదికకు లంచం డిమాండ్
### ఏసీబీ వలలో చిక్కిన ఆత్మకూర్ గ్రామ పాలన అధికారి



కాకతీయ, కరీంనగర్/జగిత్యాల: పట్టాదారు పాస్‌బుక్‌లో పేరు సవరణకు సంబంధించిన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపేందుకు రూ.5 వేల లంచం డిమాండ్ చేసిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామ పాలన అధికారి (జీపీఓ) మాతే రాజేష్‌ను ఏసీబీ అధికారులు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడి పేరు సవరణ ప్రక్రియలో విచారణ నివేదికను పంపించేందుకు మాతే రాజేష్ రూ.5 వేల లంచం కోరాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం అధికారులు ఆత్మకూర్ గ్రామ పాలన కార్యాలయంలో నిఘా ఏర్పాటు చేశారు. ఏసీబీ సూచనల మేరకు ఫిర్యాదుదారుడు రూ.5 వేల నగదును జీపీఓ హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచగా, వెంటనే అధికారులు దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షలో హ్యాండ్‌బ్యాగ్‌కు పాజిటివ్ ఫలితం వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగిగా అధికారాన్ని దుర్వినియోగం చేసి అక్రమంగా లంచం స్వీకరించినందుకు మాతే రాజేష్‌ను అరెస్టు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అతడిని కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

## మృతదేహానికి వైద్యం చేశారా..?

### చికిత్స పేరుతో బిల్లులు వేశారా..?!
### హనుమకొండ ప్రైవేట్ ఆసుపత్రిపై కుటుంబ సభ్యుల తీవ్ర ఆరోపణలు
### సమగ్ర విచారణ చేసి నిజానిజాలు తేల్చాలని అధికారులకు వినతి



కాకతీయ, హనుమకొండ: హనుమకొండలోని ఓ ప్రైవేట్ న్యూరో ఆసుపత్రిపై చికిత్స పేరుతో భారీ బిల్లులు వసూలు చేస్తున్నారంటూ రోగి కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. బ్రెయిన్ డెత్ సంభవించిన తర్వాత కూడా వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స కొనసాగిస్తున్నట్లు చూపుతూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఆరోగ్యశ్రీ అధికారులు, పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బుల్లికొండ గ్రామానికి చెందిన పంజాల శ్రీధర్ మెదడులో రక్తగడ్డ ఏర్పడటంతో తొలుత బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారని, అనంతరం విజయ టాకీస్ సమీపంలోని ఓ న్యూరో ఆసుపత్రికి తరలించి బ్రెయిన్ సర్జరీ నిర్వహించారని ఆయన తండ్రి జలంధర్ తెలిపారు. అయితే శస్త్రచికిత్స జరిగిన రెండు రోజుల నుంచే ఎలాంటి స్పందన లేదని, రోగి పరిస్థితిపై వైద్యులు స్పష్టత ఇవ్వకుండా "95 శాతం గ్యారెంటీ లేదు" అంటూ తప్పించుకుంటున్నారని ఆరోపించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఇప్పటికే భారీ మొత్తంలో బిల్లులు చెల్లించగా, ఆరోగ్యశ్రీ చికిత్స కొనసాగుతోందని చెబుతూనే సుమారు రూ.70 వేల వరకు నగదు కూడా వసూలు చేశారని పేర్కొన్నారు. పూర్తి బిల్లులు చెల్లించిన తర్వాతే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆసుపత్రి యాజమాన్యం ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు. శ్రీధర్‌కు భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారని తెలిపారు.

### ఆసుపత్రి యాజమాన్యం స్పందన కోసం ఎదురుచూపు

ఈ ఆరోపణలపై సంబంధిత ఆసుపత్రి యాజమాన్యం నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఆరోపణలపై వారి వివరణ వచ్చిన తర్వాతే పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లా వైద్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.